# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 27-05-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ప్రజల సంక్షేమాభివృద్ధకి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- రాష్ట్రంలో సినిమా థియేటర్ల నిర్వహణను సక్రమంగా చేపట్టి, ప్రేక్షకులకు మెరుగైన సేవలు అందించాలని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ అన్నారు.
- అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని "యోగాంధ్ర" పేరిట ప్రభుత్వం పలు అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తోంది.
- వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది.

===========================

రాష్ట్ర ప్రజల సంక్షేమాభివృద్ధకి ఎన్డీయే కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. వైఎస్ ఆర్ కడప జిల్లాలో ఈరోజు ప్రారంభమైన తెలుగుదేశం పార్టీ మహానాడు కార్యక్రమ్మలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆరోగ్య, ఆనందదాయకమైన సమాజ నిర్మాణమే తమ విధానమన్నారు. "అన్నదాత సుఖీభవ కింద కేంద్ర ప్రభుత్వం ఇచ్చే 6 వేల రూపాయలతో కలిపి సంవత్సరంలో మూడు విడతలుగా 20 వేలు రూపాయలను అందజేస్తామన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తామని తెలిపారు. రాష్ట్రంలో 5 రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లు ప్రారంభిస్తున్నామని తెలిపారు. అవినీతికి ఎక్కడా చోటు లేదని, ఎవరు తప్పు చేసిన వారిని కఠినంగా శిక్షిస్తామని ముఖ్యమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 24 సెకన్లు)

===========================

ఆంధ్రప్రదేశ్‌లో సినిమా థియేటర్ల నిర్వహణను సక్రమంగా చేపట్టి, ప్రేక్షకులకు మెరుగైన సేవలు అందించాలని ఉప ముఖ్యమంత్రి కె. పవన్‌కల్యాణ్ అన్నారు. ఈ మేరకు ఈరోజు విడుదల చేసిన ప్రకటనలో కొత్త చిత్రాల విడుదల సందర్భంలో టికెట్ ధరల పెంపు కోసం నిర్మాతలు, వారికి సంబంధించిన వారు వ్యక్తిగత హోదాలో కాకుండా తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి ద్వారానే ప్రభుత్వాన్ని సంప్రదించే విధానాన్ని అమలు చేయాలని దిశానిర్దేశం చేశారు. టికెట్ ధరల పెంపు, సినిమా థియేటర్ల నిర్వహణ సహా ఏ విషయంలోనైనా ప్రభుత్వ శాఖలు తమ విధులను, పర్యవేక్షణను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. త్వరలో విడుదల కానున్న సినిమాలకు సైతం టికెట్ ధరల పెంపు కోసం నిర్మాతలు చలనచిత్ర వాణిజ్య మండలి ద్వారానే ప్రభుత్వానికి అర్జీ ఇచ్చి, సంప్రదింపులు చేయాలని స్పష్టం చేశారు. తినుబండారాల నాణ్యత, ధరలపై సంబంధిత శాఖాధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి ధరల నియంత్రణ చేపట్టాలని తెలిపారు. ధరలు తగ్గితే ప్రేక్షకుల సంఖ్యా పెరిగి, పన్నుల రూపంలో ప్రభుత్వానికి ఆదాయం మెరుగవుతుందన్నారు.

=============================

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని జూన్ 21వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా యోగా అవగాహనపై ప్రభుత్వం పలు కార్యక్రమాలను నిర్వహిస్తుంది. దీనిలో భాగంగా పలు జిల్లాలలో యోగాంధ్ర పేరిట ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోంది. సంపూర్ణ ఆరోగ్యానికి యోగాభ్యాసం మంచి మార్గమని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ పేర్కొన్నారు. ఈరోజు పాడేరులో యోగాంధ్రా ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రతీ ఒక్కరి జీవన విధానంలో యోగాసనాలు నిత్యం భాగం కావాలన్నారు.

అదేవిధగా పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురంలోని వలందర రేవులో యోగాంధ్రా మాసోత్సవాలలో భాగంగా వ్యాయామాలు, యోగాసన, ప్రాణాయామాలు చేశారు. ఈ సందర్భంగా యోగాను క్రమం తప్పకుండా సాధనచేస్తే ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరమని ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా సంయుక్త కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి పేర్కొంటూ...

(వాయిస్ 22 సెకన్లు)

=============================

భారత ప్రామాణికాలను ఇప్పుడు ప్రపంచ వ్యాపంగా పాటిస్తున్నారని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. ఢిల్లీలో ఈరోజు జరిగిన బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (BIS) గవర్నింగ్ కౌన్సిల్ సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... 2014-15లో భారత్‌లో కేవలం 2 వేల స్టాండర్డ్స్ మాత్రమే ఉన్నాయని.. 2025 నాటికి ఆ సంఖ్య 23 వేలకు చేరిందన్నారు. ప్రమాణీకరణ సంఖ్యను 55 వేలకు పెంచడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. భారత్ తయారు చేసిన స్టాండర్డ్స్ 95 శాతం గుర్తింపు పొందాయని, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా సమన్వయం చేశారని వివరించారు. హాల్ మార్కింగ్ విషయంలో గణనీయమమైన అభివృద్ధి జరుగుతోందన్నారు. భారత దేశంలో ప్రమాణాల పరిరక్షణ, నాణ్యత నియంత్రణ, వినియోగదారుల న్యాయ హక్కుల పరిరక్షణలో బీఐఎస్ పాత్ర స్పష్టంగా ప్రతిబింబిస్తోందని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.

విరామం

=============================

ఈ సంవత్సరం ముందుగానే వర్షాలు మొదలవ్వడంతో వీలైనంత త్వరగా ఖరీఫ్ సీజన్ పనులను మొదలు పెట్టాలని విజయనగరం జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అధికారులకు సూచించారు. తహసీల్దార్లు, మండల వ్యవసాయాధికారులతో ఈరోజు జరిగిన దృశ్యమధ్యమ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రైతు సేవా కేంద్రాలు, గోదాముల్లో ఖరీఫ్‌కు అవసరమైన విత్తనాలు, ఎరువులు కూడా సిద్దంగా ఉన్నాయని చెప్పారు. ఖరీప్ సీజన్ ప్రారంభించేందుకు జిల్లా యంత్రాంగం సన్నద్ధంగా ఉందని తెలిపారు. సీజన్‌కు అసవరమైన ఎరువులను కూడా ముందుగానే సిద్ధం చేశామన్నారు. అక్టోబరులోగా కోతలు పూర్తి చేసేవిధంగా వీలైనంత వేగంగా వరి నారు పోసుకోవాలని సూచించారు. జిల్లాలో ఈ సంవత్సరం సుమారు 16,500 మంది కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేసి, వారికి 150 కోట్ల రూపాయల రుణాలను ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామని కలెక్టర్ తెలిపారు.

============================

ఆపరేషన్ సింధూర్ ని విజయవంతం చేసిన భారత సైన్యానికి దేశ ప్రజానీకం జేజేలు పలుకుతోంది. భారత త్రివిధ దళాలకు సంఘీభావంగా ఆకాశవాణి వార్తా విభాగం ప్రత్యేక కథనాలను అందిస్తోంది. అందులో భాగంగా కార్గిల్ యుద్ధంలో వీరోచితంగా పోరాడిన లెఫ్టినెంట్ మనోజ్ కుమార్ పాండే గురించి ఈరోజు తెలుసుకుందాం…

(వాయిస్ 42 సెకన్లు)

============================

"ధర్తీ ఆబా జన్ జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్" అవగాహన కార్యక్రమాలను విజయవంతం చేయాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ తెలిపారు. జూన్ 15 నుండి 30వ తేదీ వరకు ఈ అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని ఆయన చెప్పారు. మహిళా శిశు సంక్షేమ శాఖ, గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులతో ఈరోజు కలెక్టర్ కార్యాలయంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి జన్ జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్, ధర్తీ ఆబా జన్ జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. దేశ వ్యాప్తంగా గిరిజన ప్రాంతాలలో పౌర సేవలు, మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుని ఈ కార్యక్రమాలను చేపడుతుందన్నారు. ఈ ప్రచారంలో భాగంగా గ్రామ స్థాయి శిబిరాల ద్వారా ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్, ఆయుష్మాన్ భారత్ కార్డ్ తో సహా కిసాన్ క్రెడిట్ కార్డ్, పీఎం కిసాన్, జన్ ధన్ ఖాతా, బీమా కవరేజ్ వంటి పలు పత్రాలను అందిస్తారని తెలిపారు.

============================

దేశ వ్యాప్తంగా ఈనెల 29 నుంచి జూన్ 12వ తేదీ వరకు వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ యాత్రలను నిర్వహించనున్నామని శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్ర, సమన్వయకర్త డాక్టర్ కె. భాగ్యలక్ష్మి ఈరోజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి రోజు మూడు గ్రామాల్లో ఈ యాత్ర ఉంటుందన్నారు. ఈ యాత్రల్లో రైతులు, శాస్త్రవేత్తలు, వ్యవసాయాదికారులు ముఖాముఖి నిర్వహించడంతో పాటు ఖరీఫ్ సీజన్ లో అనువైన పంటలు, అధిక దిగుబడినిచ్చే రకాలు, నూతన సాంకేతిక పరిజ్ఞానంపై రైతులకు అవగాహన కల్పించనున్నామని చెప్పారు.

============================

ప్రయాణికుల రద్దీని దృష్ట్యా తెలుగు రాష్ట్రాలతో పాటు వివిధ ప్రాంతాలకు వారాంతపు ప్రత్యేక రైళ్లను నడపన్నామని దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. విశాఖపట్నం – బెంగళూరు మధ్య జూన్ ఒకటి నుంచి 29వ తేదీ వరకు ప్రతి ఆదివారం ప్రత్యేక రైలు రాకపోకలు సాగిస్తుందని పేర్కొంది. జూన్ 4 నుంచి జులై 30 వరకు విశాఖపట్నం – తిరుపతి మధ్య ప్రత్యేక రైలును ప్రతి బుధవారం నడపనున్నామని పేర్కొంది.

============================

వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఇది రాబోయే 48 గంటల్లో మరింత బలపడే అవకాశముందని వెల్లడించింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో రేపు పలు చోట్ల వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖాధికారిణి వివరిస్తూ…

(వాయిస్ 30 సెకన్లు)

============================
============================